క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడికొండూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు శనివారం తెలిపారు. నూతనంగా 33కేవీ విద్యుత్ లైను ఏర్పాటు, విద్యుత్ లైన్‌లలో చెట్లు తొలగింపు, మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మురుగుడు లావణ్య విజయం తథ్యం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: సంక్షేమం అభివృద్ధే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాయని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు అధికారంలో భాగస్వాములను చేసి వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. బీసీలకు అవకాశం ఇవ్వాలనే తాను పోటీకి దూరంగా ఉన్నానని స్పష్టం చేశారు. రానున్న చట్టసభల్లో బడుగు బలహీన వర్గాల మహిళల అధికంగా ఉంటారని పేర్కొన్నారు. మంగళగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ప్రచారంలో లావణ్యకు మహిళల ఆదరణ అపూర్వంగా ఉందని, తప్పకుండా విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు.

తాడేపల్లి సీఐగా కల్యాణ్ రాజు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐగా కల్యాణ్ రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి సీఐగా పనిచేస్తున్న మధుసూదనరావును పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేసి, నెల్లూరులో సీఐగా పనిచేస్తున్న కళ్యాణ్ రాజును ఇక్కడికి బదిలీ చేశారు.

24న కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని శ్రీ విశాలాక్ష్మి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం 82వ తిరునాళ్ల ఈ నెల 24న నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ ఈవో జి.రామిరెడ్డి , దేవస్థాన చైర్మన్ పి.వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న బిందె తీర్థం, అభిషేకం, సాయంత్రం ప్రధాన కలశస్థాపన, 23న బలిహరణ, సాయంత్రం రాయభారం, ఎదురుకోలు, కల్యాణం, 24న స్వామి ఉత్సవ మూర్తులతో ఊరేగింపు, రథోత్సవం నిర్వహిస్తారన్నారు. 25న కుంకుమార్చన, వసంతోత్సవం, పవళింపు సేవలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు రావూరి పూర్ణచంద్రశాస్త్రి, ఆంజనేయశాస్త్రిల పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను వివరించారు. పాలిటెక్నికల్ కాలేజి ప్రిన్సిపల్ బి. జీవన్ కుమార్, సిబ్బంది గోపయ్య, వైద్య సిబ్బంది డి.భారతి, కె. జీవన జ్యోతి, డి. సామ్రాజ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

మేడికొండూరు: మండల పరిధిలోని జోగిపర్రు ఓసీ, బీసీ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్‌వైజర్ కె.సీతారావమ్మ హాజరై మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం వల్ల ప్రయోజనం చేకూరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, షర్మిల, టి. శివపార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొల్లి శారద మార్కెట్‌లో షాపుల స్వాధీనానికి ఆదేశాలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో 2023 మే 31 నాటికి 25 సంవత్సరాలు లీజు పూర్తి చేసుకోనున్న షాపులను స్వాధీనం చేసుకోవాలని అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్టాండ్ ఎదురుగా 1999లో మార్కెట్ నిర్మాణమైంది. ఆ సమయంలో 75 మందికి నగరపాలక సంస్థ అధికారులు షాపులు కేటాయించారు. ప్రస్తుతం లీజు గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటిని స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

స్వర్ణకార సంఘం ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: స్వర్ణకారులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు స్పష్టం చేశారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని శనివారం వారు సందర్శించారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్వర్ణకారులకు భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొన్ని కారణాల వల్ల భవన నిర్మాణం ఆగిందన్నారు. మరలా అధికారంలోకి వచ్చిన వెంటనే సాంకేతిక కారణాలను అధికమించి స్వర్ణకారులకు భవన నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మునగాల మల్లేశ్వరరావు, మురుగుడు సత్యం, అవ్వారు సత్యకృపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మంగళగిరి: ఆటోనగర్‌లోని కార్యాలయంలో 24 మంది బాధితులకు రూ.11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో వెయ్యి మందికిపైగా బాధితులకు రూ.6 కోట్లు సీఎం సహాయ నిధి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, జేసీఎస్ కన్వీనర్ ఎండి ఫిరోజ్, మురుగుడు సత్యం పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళి

మంగళగిరి: పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ వి.నిర్మల్ కుమార్, నాయకులు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే ఆర్కే నివాళి

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీమన్నారాయణ

తాడికొండ: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీమన్నారాయణ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 24 గంటల లోపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, ఫోటోలు ప్రచార సామగ్రి లేకుండా తొలగించాలన్నారు. 48 గంటల్లోగా గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లోని బ్యానర్లు, ప్రచారానికి సంబంధించిన ఇతర ఏవైనా ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కనుక ముందుగా వారికి అవగాహన తెలియజేసి తొలగించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగానంత్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'చలపతి కళాశాల'లో 6న హాక్ ఫెస్ట్

బ్రోచర్ ఆవిష్కరించిన కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైవీ ఆంజనేయులు, సిబ్బంది

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్–6న జాతీయస్థాయి పీఎస్‌జీ ఐటెక్ హాక్ ఫెస్ట్– 2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. పీఎస్‌జీ టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న హాక్ ఫెస్ట్ బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు శనివారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఫెస్ట్‌కు తమ కళాశాల ప్రాంగణం ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌లు 4–5 మందితో ఉండాలన్నారు. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ చదువుతున్న ఏ బ్రాంచి విద్యార్థి అయినా ఈ పోటీలకు అర్హులని తెలిపారు. క్రౌడ్ సోర్స్ డిజాస్టర్, గ్రీన్ క్రెడిట్ మేనేజ్‌మెంట్, రెవల్యూషనైజింగ్ టుమారో, హార్నెజింగ్‌లలో ప్రాంతీయ రౌండ్‌కు ఐడియా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతి టీమ్ ఒక ఐడియాను తెలియజేయాలని, మంచి ఐడియా సమర్పించిన టీమ్‌లకు ప్రాంతీయ రౌండ్ పోటీలలో క్యాష్ బహుమతులు పొందవచ్చన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2.50 లక్షలు, ద్వితీయం రూ.1.50 లక్షలు, తృతీయం రూ. లక్షగా బహుమతులు ప్రకటించినట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాస రావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌లు ప్రొఫెసర్ ఎస్.శాంతి ప్రియ, డాక్టర్ బాల మురళీకృష్ణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జె.జయకృష్ణ, ఉపాధి కల్పనాధికారి ఎ.ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

బోరు పంపులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పాస్టర్, వైఎస్సా ర్‌సీపీ నాయకులు

తాడికొండ: తాడికొండ ఎస్సీ కాలనీ 16వ వార్డులో రెండు బోరు పంపుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కాలనీలోని తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దీంతో మండల పరిషత్ నిధులతో మాజీ వార్డు మెంబర్ రాయపాటి దాసు, ఉండవల్లి శేషయ్య నివాసాల సమీపంలో బోర్లు వేశారు. ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, మాజీ చైర్మన్ వంగా పోలారెడ్డి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ తుమ్మల తిరుపతిరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు తోకల నరసింహారావు, స్థానిక మెంబర్ ఉండవల్లి నరసింహారావు, బెజ్జం సాయి ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్యాన్ని విషతుల్యం చేస్తున్న సామాజిక మాధ్యమాలు

ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల, పాల్ రత్నాకర్

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక మాధ్యమాలకు అలవాటు పడుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి అన్నారు. లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో "సామాజిక మాధ్యమాల వ్యసన నియంత్రణ–విద్యార్థుల క్షేమం కోసం కౌన్సెలింగ్ పద్ధతులు" పై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా బాల్యాన్ని విషతుల్యం చేస్తోందని తెలిపారు. సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్న కారణంగా విద్యాప్రగతి కుంటుపడటంతో పాటు ఏకాగ్రత లోపం ఉత్పన్నమయ్యే ప్రమాదముందని చెప్పారు. స్మార్ట్‌ఫోన్లను పిల్లలకు దూరంగా ఉంచాల్సిన విషయాలపై అవగాహన పెంచుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఎస్తేరు సునీల మాట్లాడుతూ విద్యార్థుల్లో అధిక శాతం స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారడం వల్ల వారిలో విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయని తెలిపారు. భావి పౌరుల ఉజ్వల భవిష్యత్తును ఆశించి, వర్క్‌షాప్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్లినికల్ సైకాలజిస్టులు డాక్టర్ పి. అంజన్‌కుమార్, డి. శ్రీనివాస్ స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలైన పిల్లల ప్రవర్తనలో లోపాలను గుర్తించడంతో పాటు సరైన మార్గంలోకి తెచ్చేందుకు తీసుకోవాల్సిన పద్ధతులను పలు కేస్ స్టడీస్ ద్వారా వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పాల్ రత్నాకర్ మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ ప్రభావంతో పిల్లల్లో నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. సోషల్ మీడియా పరిణామాలు విద్యార్థులను డెత్‌గేమ్స్ వైపు, ఆత్మహత్యల దిశగా పురి గొల్పుతున్న పరిస్థితులను స్పందన ఈదా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి వివరించారు. కళాశాల మనోవిజ్ఞానశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఇన్నారెడ్డి పోర్నోగ్రఫీ చట్టం గురించి వివరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వర్క్‌షాప్‌లో పాల్గొన్న 250 మంది ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

లోక్ అదాలత్‌లో 149 కేసుల పరిష్కారం

మంగళగిరి: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 149 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్ 2, బ్యాంకు సీఎల్‌సీలు 28, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్ 2, క్రిమినల్ కేసులు 8, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో క్రిమినల్ కేసులు 101, గృహ హింస కేసులు 3, మనోవర్తి కేసులు 3, చెక్ బౌన్స్ కేసులు 2 పరిష్కారమయ్యాయి. ఆయా కేసులకు సంబంధించి రూ.81.85లక్షలు ఇరువర్గాల మధ్య చెల్లింపులు జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.ప్రత్యూష, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు కేబీ అంబేడ్కర్, రజని పాల్గొన్నారు.

మహిళా గ్రంథాలయం తనిఖీ

తాడికొండ: తాడికొండలోని మహిళా గ్రంథాలయ శాఖను శనివారం గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠకుల హాజరు, రికార్డులు తనిఖీ చేశారు. పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుచరితకు కృతజ్ఞతలు

తాడికొండ: ఎమ్మెల్యే మేకతోటి సుచరితను జిల్లా ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా గద్దె రూబేన్, జిల్లా సేవాదళ్ కార్యదర్శి కర్రి రవిపాల్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి, అభివృద్ధికి కష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి హరికృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ భీమవరపు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



కారులో హ్యాండ్ బ్యాగ్ చోరీ

నగరంపాలెం: కారు పార్కింగ్ చేస్తానని అందులోని హ్యాండ్ బ్యాగ్ అపహరించడంపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదైంది. గుంటూరు మెడికల్ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదివే ఓ వైద్య విద్యార్థిని ఈనెల 2న బృందావన్ గార్డెన్స్‌లోని సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణ మండపంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరైంది. ఆమె భోజనం చేసే సమయంలో ఓ వ్యక్తి వచ్చి కారు సెల్లార్‌లో నిలుపుదల చేస్తానంటూ తాళాలు తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఆమెకిచ్చి అక్కడ నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. అనంతరం కారు తలుపులను తీయగా హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. అందులో బంగారు గొలుసు, ఏటీఎం, ఆధార్ కార్డులతో ఉన్న చేతి సంచి అపహరణకు గురైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సంగీత సన్మండలి వార్షికోత్సవం ప్రారంభం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం. వై. శేషురాణి ఆధ్వర్యంలో సంస్థ 27వ వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. సంగీత సుధానిధి వీరఘంట లలిత, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సూర్యకాంతం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వీరఘంట చంద్రశేఖర్, సన్మండలి గౌరవాధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్వాన్ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణను గౌరవ పురస్కారంతో సత్కరించారు. అనంతరం చెన్నైకు చెందిన విదుషి నైవేలీ శ్రీరంజని సంతాన గోపాలం శాస్త్రీయ సంగీత కచేరి శావ్యంగా సాగింది. వయోలిన్‌పై సాయిరక్షిత్, మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితాదేవి, కార్యదర్శి మంగా దేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, డాక్టర్ సుమిత్ర పర్యవేక్షించారు.

హామీలు అమలు చేసిన ఏకైక సీఎం జగన్

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

వెలగపూడి(తాడికొండ): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసి ఎన్నికలకు వెళ్ళి ఓట్లు అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో ఒకే ఒక్కడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. శనివారం, తుళ్ళూరు మండలం వెలగపూడి, మల్కాపురం గ్రామాల్లో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి ప్రజలు ఓట్లేస్తారనుకోవడం అవివేకమని, 40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన బాబు ప్రజలకు గుర్తుండి పోయేలా ఒక్క సంక్షేమ పథకం అయినా అమలు చేశాడా అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి కోసం రాజీలేకుండా పోరాటం చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలను పేదవాడి ఖాతాలకు నేరుగా చేర్చి ప్రతి కుటుంబానికి అండగా నిలిచారనడంలో సందేహం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించి పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మహిళలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు విని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొర్రా వెంకట శివారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శృంగారపాటి సందీప్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చలివేంద్రం సురేష్, జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ తూమ్మూరు రమణారెడ్డి, జిల్లా యువజన విభాగం సహాయ కార్యదర్శి చలివేంద్రం కార్తీక్, తుళ్ళూరు గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలోకం సురేష్, గ్రామపార్టీల అధ్యక్షులు మెండెం ఆరోగ్యం, ఆలోకం సురేష్, వర ప్రసాద్ రెడ్డి కొమ్మినేని దత్తు, అన్నే జక్రయ్య, కోలేటి అనీల్, ఆలూరి శ్రీనివాసరావు, కొయ్యగూర వినోద్, ఆరేపల్లి జోజి, కాపు రమేష్, రావూరి కిషోర్, గోచిపాతల నాగేశ్వరరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థాన ఆస్తుల పరిరక్షణే పాలక మండలి లక్ష్యం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- కొలువుదీరిన సోమేశ్వరస్వామి, వీరభద్ర స్వామి ఆలయ పాలక మండళ్లు



సోమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే



తాడేపల్లి వీరభద్రస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

తాడేపల్లిరూరల్ : ప్రసిద్ధి గాంచిన తాడేపల్లిలోని వీరభద్రస్వామి దేవస్థానం, సీతానగరంలోని సోమేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన పాలక మండలితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆచార సాంప్రదాయలను కాపాడుతూ పూర్వీకులు దేవస్థానాలు నిర్మించారని, దూప, దీప, నైవేద్య నిర్వహణ కోసం భూములిచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆ భూములను కాలక్రమేణ అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడి దేవస్థానాలకు అప్పజెప్పే విధంగా పాలక మండలి సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయానికి వచ్చే భక్తుల మనోభావాలను కాపాడాలని, అప్పుడే పాలక మండలికి గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. తాడేపల్లి సీతానగరంలోని సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా చిన్నబోతుల దుర్గారావు, సభ్యులుగా దొంతిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పట్నాల నీలవేణి, కొమర నూకరత్నం, పిల్లా లక్ష్మీకాంతమ్మ, కోడూరు దుర్గారావు, వై.శ్రీనివాసరావు, తాడేపల్లిలోని వీరభద్రస్వామి దేవస్థానం పాలక కమిటీ చైర్మన్‌గా కందుల వెంకయ్య, సభ్యులుగా కొర్రబండి శ్రీనివాసరావు, కుంబ నిర్మల, దొంతిరెడ్డి శ్యామల దేవి, సువర్ణకంటి పుష్పవతి, తమ్మా సుబ్బారెడ్డి, తాడేపల్లి శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ జేసీఎస్ కో–ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, సేవాదళ్ నాయకులు రమేష్, కేవీఆర్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కళ్ళం రాజశేఖరరెడ్డి, తాడేపల్లి మహిళా అధ్యక్షురాలు అప్పికట్ల సంపూర్ణ పార్వతి ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా మురుగుడు లావణ్య ప్రచారం



భార్గవపేటలో మురుగుడు లావణ్య ప్రచారం

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని 18వ వార్డు భార్గవ పేటలో ఇంటింటికి తిరిగారు. మహిళలు పెద్ద ఎత్తున లావణ్యకు హారుతులతో స్వాగతం పలికారు. లావణ్య మాట్లాడుతూ ప్రజా స్పందన అపూర్వంగా ఉందన్నారు. తప్పకుండా విజయం సాధిస్తామని తమ మీద నమ్మకం ఉంచి, సీటు కెటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తాను గెలిచి మంగళగిరి సీటును బహుమతిగా ఇస్తానని దీమా వ్యక్తం చేశారు. అదే విధంగా 29 వార్డులో మాజీ కౌన్సిలర్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి వెంకట నాగమోహనరావు, గుర్రం విజయ్‌కుమార్, సుబ్బారెడ్డి, బిజిలీ, అష్రఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

సంస్కృతిని గౌరవిస్తూ కొత్తదనాన్ని స్వాగతించాలి

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు



పాఠశాల వార్షికోత్సవంలో అద్దంకి శ్రీధర్‌బాబు, మౌనిక, రథినీచౌదరి, శ్రీనివాస్, కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ కొత్తదనాన్ని స్వాగతించాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ 39వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గురువుల మార్గదర్శనంలో క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగుతూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు కో–కరిక్యులర్ యాక్టివిటీస్‌లో సైతం ముందుండాలని అన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చి, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం ద్వారా ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలతో పాటు విద్యార్థుల ప్రగతిని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో అద్దంకి మౌనిక, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య, ఏవో కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.